క్లుప్తంగా

గంగమ్మ ఒడికి చేరిన దుర్గమ్మ



నిమజ్జనం చేస్తున్న భక్తులు

దుద్యాల్: మండల వ్యాప్తంగా ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గామాత విగ్రహాలను శనివారం ఉదయం నిమజ్జనం చేశారు. హస్నాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు విగ్రహాలను శుక్రవారం రాత్రి 11 గంటలకు శోభాయాత్ర అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

సిద్దనొంపు ఆంజనేయ స్వామికి పూజలు

భక్తిశ్రద్ధలతో సామూహిక హనుమాన్ చాలిసా పారాయణం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్దనొంపు పడమటి ఆంజనేయస్వామికి శనివారం హిందూవాహిని, ఆర్ఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, సిందూర లేపనం, విశేష అలంకరణ, ధూపం, దీపం, నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు ఇచ్చారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలిసా పారాయణం చేశారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

దోమ: మండల కాంగ్రెస్ నేతలు పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేకు జమ్మి ఆకులు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు ఈడిగి ఆశన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కోటబాసుపల్లిలో ఇంద్రారెడ్డి జయంతి



ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, తదితరులు

తాండూరు రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోం మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతిని కోటబాసుపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి శనివారం కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోట్టిగ రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు విఘ్నేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందక లేగదూడ మృతి



లేగదూడ కళేబరం

బంట్వారం: సరైన పశువైద్యం అందక ఓ లేగ దూడ మృత్యువాత పడింది. ఈ సంఘటన శనివారం కోట్‌పల్లి మండలంలోని నాగసాన్‌పల్లి తండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రైతు చాంప్లానాయక్‌కు చెందిన లేగదూడకు 15 రోజుల క్రితం వైరస్ సోకింది. ప్రభుత్వ పశువైద్యశాలలో సరైన మందులు లేకపోవడంతో ప్రైవేట్‌లో మందులు కొనుక్కుని వైద్యం చేయించాడు. వైరస్ సోకిన లేగదూడ కాళ్ల నొప్పులతో నడవకపోవడంతో అడవిలోనే ఉంచి వైద్యం చేయించారు. అయినప్పటికీ లేగదూడ బతకలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. మరో నాలుగు దూడలకు కూడా వైరస్ సోకిందని వాటికైనా సరైన వైద్యం అందజేయాలని కోరుతున్నాడు.

కాగితాలకే పరిమితం!

- అభివృద్ధి కమిటీల పర్యవేక్షణ కరువు
- అమలుకు నోచుకోని పథకాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బాలంపేట ఉన్నత పాఠశాలలో కమిటీ సమావేశం (ఫైల్)

దౌల్తాబాద్: ప్రభుత్వ సంస్థల పనితీరుపై పర్యవేక్షణ కోసం నియమించిన కమిటీలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. పథకాల్లోని లోటుపాట్లను సరిచేసి నిర్వహణ తీరును మెరుగుపర్చాల్సి ఉండగా, నామమాత్రంగా మారి క్షేత్రస్థాయిలో పథకాల అమలుకు నోచుకోవడం లేదు. ఒకట్రెండు చోట్ల అడపాదడపా సమావేశాలు నిర్వహించి సరిపెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో..

ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. సదుపాయాలు మధ్యాహ్న భోజనం తదితర పథకాలను కమిటీలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అవీ ఎక్కడా కూడా చురుగ్గా పనిచేయడం లేదు. వాటి నిర్వహణ తీరు కూడా సక్రమంగా లేదని పలువురు బాహటంగానే చెబుతున్నారు. అభివృద్ధి పనులు జరిగినప్పుడు మాత్రమే సంతకాల కోసం కమిటీ చైర్మన్లకు సమాచారం చేరుతుంది. ప్రతీ నెల మూడో శనివారం సమావేశమై సమస్యలపై చర్చించాలి. కానీ చాలా బడుల్లో నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ఈ విషయం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్రజాపంపిణీపై పర్యవేక్షణ..

రేషన్ దుకాణాలపై పర్యవేక్షణకు మండల, డివిజన్ స్థాయిలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేశారు. మూడు నెలలకోసారి సమావేశమై వాటి నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న పోషకాహారం తదితరాల్లో లోపాలుంటే చర్చించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఈ కమిటీలు మనుగడలో ఉన్నట్లు కూడా అసలు ఎవరికీ తెలియని దుస్థితి నెలకొంది. ఇటీవల ఎక్కడైనా సమావేశాలు నిర్వహించిన దాఖలాలు కూడా లేవు.

అంగన్‌వాడీల్లోనూ అంతే..

అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ, పథకాల అమలు తీరుపై పర్యవేక్షించేందుకు అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ సపోర్టు కమిటీ (ఏఎల్ఎంఎస్‌సీ) ఏర్పాటు చేశారు. ఇవి అలంకారప్రాయంగానే ఉన్నాయి. కమిటీలో స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, మహిళలు, కిశోరబాలికలు, తదితరులు ఉంటారు. అయితే గ్రామాల్లో ఈ కమిటీలు ఉన్నాయని కూడా చాలా మందికి తెలియదు. పర్యవేక్షణ లేని కారణంగా కొన్ని ప్రాంతాల్లో వీటి సేవలు సక్రమంగా అందడంలేదు.

ఆస్పత్రి కమిటీలు..

ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు కూడా వాటి కోవలోకే వస్తాయి. ఇవీ కూడా నామమాత్రంగానే మారాయి. నిధులు వచ్చినప్పుడు మాత్రమే సభ్యులు పిలిచి తీర్మానం చేసి సంతకాలు చేయించుకుంటారు. వీటిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంగా ఉంటారు. వీరు కూడా వాటిని పట్టించుకోవడం లేదు. మూడు నెలలకోసారి నిర్వహించాల్సి ఉన్నా సక్రమంగా సమావేశాలు జరగడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇలా కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలకు అందాల్సిన పథకాలు దరిచేరడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధతీసుకొని కమిటీలు కార్యరూపం దాల్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్
- పెద్దేముల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం
- జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో జెండా ఎగరాలని పిలుపు



మాట్లాడుతున్న ధారాసింగ్, తదితరులు

తాండూరు రూరల్: ప్రతీకార్యకర్త కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో మండలంలోని కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ..స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యకర్తల అభిప్రాయం తెలుసుకొని పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సర్పంచు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకునే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, లొంక నర్సిములు ఉప్పరి మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము గోపాల్‌రెడ్డి, రియాజ్, బుద్దారం వెంకటయ్య, బాబుసింగ్, శివరాం, శంకర్, కోహీర్ రవి, డీవై నర్సిములు, నసీరోద్దిన్, లక్ష్మణ్‌నాయక్, మహేష్‌కుమార్, సురేశ్ నాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానానికి సూచించిన పేర్లు ఇవే..

పెద్దేముల్ జెడ్పీటీసీ ఎస్టీ జనరల్ రిజర్వేషన్ కావడంతో అధికార కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. తట్టెపల్లికి చెందిన కేతావత్ శంకర్, శివరాం నేనావత్, సుమిత్ర రాథోడ్, సురేశ్ నేనావత్, రాము జాదవ్ పేర్లను అధిష్టానానికి పంపిం చినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ప్రత్యేక బృందాలు మండలాల్లో పర్యటించి పోటీ చేయనున్న అభ్యర్థులపై సర్వే చేయించి ఎమ్మెల్యేకు రిపోర్ట్ పంపనున్నట్లు తెలుస్తోంది. ఎంపీపీ అభ్యర్థి విషయంలో ఇంకా స్పష్టత రాలేదని చెబుతున్నారు.

ఉత్తమ విద్యార్థులను కోల్పోవడం బాధాకరం

- ఎంఈవో విజయ రామారావు
- పాఠశాలలో సంతాపం



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దుద్యాల్: అల్లిఖాన్‌పల్లి చింతల్ చెరువు ఘటనలో దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ, 8వ తరగతులు చదువుతున్న ప్రణతి, వృక్షితలను కోల్పోవడం బాధాకరమని మండల విద్యాధికారి విజయ రామారావు పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి, మౌనం పాటిస్తూ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ..తరగతిగదిలో శ్రద్ధగా పాఠాలు వినడంతో పాటు బాగా చదువుకునే వారని గుర్తు చేశారు. సెలవు రోజుల్లో ఎవరు కూడా ఈతకు వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లప్ప, రవీందర్ గౌడ్, సుధాకర్ రావు, అభయ్ కుమార్, రవి నాయక్, శ్రీనివాస్, ముకుంద రెడ్డి, రమేశ్, వాహీద్, నరసింహ రెడ్డి, సాలిబాయి, మాధవి, నవీన, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



గుంతలుగా మారిన పాలేపల్లి, ఐనాపూర్ రహదారి

- కంకర తేలి గుంతలుగా మారిన పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రహదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

దోమ: ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితి మారడం లేదు. ఎక్కడి గుంతలు అక్కడే ఉండి ఆ గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా తయారవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ దారి గుండా వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ మండల పరిధిలోని పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఆ వైపుగా వెళ్లాలంటే సమస్యలు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కంకర తేలి పెద్ద, పెద్ద గుంతలుగా తయారయ్యాయి. ఈ రహదారి గుండా ప్రయాణిస్తున్న వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురైన సందర్భాలు సైతం నెలకొన్నాయి. ఈ విషయం గురించి అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో బాధాకరం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ కవాతు

కొడంగల్ రూరల్: ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా కొడంగల్‌లో స్వయం సేవకులతో నిర్వహించనున్న కవాతును విజయవంతం చేయాలని సభ్యులు పేర్కొన్నారు. స్వయం సేవకులు యూనిఫామ్ ధరించి పాల్గొనాలని కోరారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయం నుంచి బస్టాండు సమీపంలోని అభయాంజనేయ స్వామివారి దేవాలయం వరకు నిర్వహించనున్న పథ సంచలన్ కార్యక్రమానికి స్వయం సేవకులు సమయానికి చేరుకోవాలని సూచించారు.

చంద్రవంచలో ఉర్సు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గేటు వద్ద ఉన్న మహబూబ్ సుభాని దర్గా ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మసీదు నుంచి గంధం జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు, గ్రామస్తులు గంధం, పువ్వులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ పెద్దలు పటేల్ సుదర్శన్‌రెడ్డి, పటేల్ రవిశంకర్, హరినరోత్తంరెడ్డిలను శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు.

మురుగు తొలగించాలని నిరసన

- నర్సింగ్ కళాశాల ఆవరణలో వెదజల్లుతున్న దుర్గంధం
- పట్టించుకోని ఆస్పత్రి సూపరింటెండెంట్



నర్సింగ్ కళాశాల ఎదుట మురుగును చూపిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆవరణలో చేరిన మురుగును తొలగించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎదురుగా ఉన్న పీపీ యూనిట్‌లో ఏర్పాటు చేసిన కళాశాల ప్రారంభం నుంచి సమస్యలతోనే కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు మరమ్మతులు చేయించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. విద్యార్థినులు ముక్కు మూసుకుని తరగతులు వింటూ, ఇక్కడే ఏర్పాటు చేసిన హాస్టల్‌లో కంపును భరిస్తున్నారన్నారు. వెంటనే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పట్టణ ఉపాధ్యక్షుడు ప్రహ్లాద్, కార్యకర్తలు బిచ్చప్ప, రాములు, సాయిలు, బబ్లూ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

కొడంగల్ రూరల్: రుద్రారం గ్రామానికి చెందిన పోషగాళ్ల దేవమ్మ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరమ్ అభినవ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ పోషగాళ్ల నర్సప్ప మరణానంతరం భూమిని అతని భార్య దేవమ్మ పేరుతో పట్టా చేయించారని, దేవమ్మ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప, నాగర్‌కర్నూల్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు సతీశ్ నైనాల, బొంరాస్‌పేట, కొడంగల్ మండలాల సంఘాల అధ్యక్షులు అంజిలప్ప, అంజి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ టికెట్ కేటాయించాలని దరఖాస్తు

తాండూరు రూరల్: జెడ్పీటీసీ జనరల్ రిజర్వు కేటగిరిలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. తమకే టికెట్ కేటాయించాలని కోరారు. ఖాంజాపూర్ గ్రామానికి చెందిన జర్నలిస్ట్ వెంకట్‌రెడ్డి, ఐనెల్లికి చెందిన హరిశ్వర్‌రెడ్డి, ఓగిపూర్‌కు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, కరన్‌కోట్ చెందిన శరణు బసప్ప, సంగెంకలాన్‌కి చెందిన రవిగౌడ్, మిట్టబాసుపల్లికి చెందిన జగదీశ్‌లు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

ఆరోగ్యమే మహాభాగ్యం

యోగనందా మహర్షి

దుద్యాల్: ఆరోగ్యమే మహాభాగ్యమని జ్ఞానతపోవనం యోగానంద మహర్షి పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతీరోజు ఆహార నియమాలు పాటించాలని సూచించారు. దుద్యాల్, సోమ్లనాయక్ తండా గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన జ్ఞాన తపోవనం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగానంద మహర్షి భక్తులకు పలు సందేశాలు ఇచ్చారు. ఔషద గుణాలు కల్గిన మొక్కలను సేకరించి ఆహారం తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం జ్ఞానతపోవనం వద్ద కాషాయ జెండాను ఆవిష్కరించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

చేవెళ్ల: బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. శనివారం నగరంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో పాటు ఆయనను మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు మండల నాయకులు, మున్సిపాలిటీ నాయకులు అండగా నిలబడి గెలిపించుకోవాలని సూచించినట్లు తెలిపారు. కృష్ణగౌడ్, కరికే శ్రీనివాస్, ఎం.నరేశ్ పాల్గొన్నారు.

హరీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



హరీశ్వర్‌రెడ్డి వర్ధంతిలో మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిగి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎల్లకాలం గుర్తుంటాయన్నారు. రెండు దశాబ్దకాలంగా పరిగికి సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎమ్మెల్యే పదవిని సైతం వదులుకుని ఉద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

షాబాద్: రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బొబ్బిలిగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బొబ్బిలిగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బేగరి విజయలక్ష్మి, బేగరి అనిల్, ఆవుల అంజయ్య, బైండ్ల కృష్ణ, వినయ్‌కుమార్‌రెడ్డి, బేగరి పెద్ద అనిల్, జోగు ప్రవీణ్‌తో పాటు పలువురు అవినాశ్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు ఏవైనా తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలలో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఏ ఒక్క మంచి చేయలేదన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మాజీ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కి మాత్రమే ఉందన్నారు. మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మాజీ జర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



కోట్‌పల్లిలో యువత శ్రమదానం

బంట్వారం: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువకులు శ్రమదానం చేసి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోట్‌పల్లి మండల కేంద్రంలోని బసవేశ్వర విగ్రహం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహన దారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించి స్థానిక యువకులు శనివారం శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేయించారు.

తూతూ మంత్రంగా మరమ్మతు పనులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కారు హౌసింగ్ తగలడంతో ఆగిపోతున్న వాహనాలు

ధారూరు: మండలంలోని రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్య ఈ నెల 27న కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారడంతో నీటి ప్రవాహానికి రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. దీంతో వరదనీటికి కొట్టుకపోయిన రోడ్డు, దెబ్బతిన్న తాత్కాలిక వంతెన మరమ్మతు పనులను తూతూమంత్రంగా చేయించి మమ అనిపించారు. ఆదివారం ఆ రోడ్డు గుండా ప్రయాణించిన వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారి మరమ్మతు పనులను సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. దెబ్బతిన్న వంతెనపై మొరం పోయించి, కంకరవేసి రాకపోకలకు అనువుగా మార్చాలి. కానీ ఆర్‌అండ్‌బీ సిబ్బంది కొద్దిగా మట్టి పోయించి వదిలేశారు. వాహనాలు వంతెనపై నుంచి వెళ్లాలంటే కింద హౌసింగ్ తగులుతుందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మారుతి ఆల్టో, స్విఫ్ట్ కార్లు దెబ్బతింటున్నాయని వివరిస్తున్నారు. అధికారులు తగిన చొరవ తీసుకుని వెంటనే అసంపూర్తి పనులను పూర్తి చేయించాలని వారు కోరారు. యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ధారూరు మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్ సూచించారు.